క్లుప్తంగా

బీఎస్పీ మండల అధ్యక్షుడి రాజీనామా


కుమార్

వీణవంక: బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కొంగల కుమార్‌యాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. వల్బాపూర్ గ్రామానికి చెందిన కుమార్‌యాదవ్ గతంలో ఎన్ఎస్‌యూఐలో 2003 నుంచి కీలకంగా పని చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీలో చేరడంతో బహుజనుల రాజ్యం వస్తుందని ఆకర్షితులై బీఎస్పీలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో చేరి పార్టీ కోసం ఆహర్నిశలు పని చేశారు. ఇటీవల ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరడంతో.. బీఎస్పీకి రాజీనామా చేసిన కుమార్ త్వరలో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లనున్నారు.

బీఎస్పీకి రాజీనామా


మాట్లాడుతున్న వాసాల రామస్వామి

జమ్మికుంట: పట్టణంలో బీఎస్పీకి పలువురు నాయకులు రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్ర, జిల్లా కమిటీకి రాజీనామా లేఖలను పంపించారని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసాల రామస్వామి బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల అధ్యక్షులు పంజాల దిలీప్‌గౌడ్, కొంగల కుమార్‌యాదవ్, మంద శివశంకర్, మండల కమిటీ బాధ్యులు రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు.

బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరుతున్న నాయకులు

మానకొండూర్: కొండపల్కల గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నల్లగొండ కొంరయ్య, మాజీ వార్డు సభ్యుడు సైండ్ల పురుషోత్తం, అరకాల సంజీవరెడ్డి, ఏగోలపు వెంకన్నగౌడ్, వాసాల భానుచందర్, గట్టు రాజు, ఏరుకొండ లక్ష్మయ్య, భూసారపు రాజయ్య, రంగు శ్రావణ్ కుమార్, తోట రవీందర్, భూసారపు స్వామి, 40 మంది బీజేపీ ఎంపీటీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరారు.

రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

వీణవంక: పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో గౌడ కులస్తులు ఆలయానికి చేరుకొని విగ్రహ ప్రతిష్ఠ తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: సిర్సపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆడెపు రాయమల్లు-సంధ్య కుమారుడి వివాహానికి బుధవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. సింగిల్‌విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఆకునూరి కరుణాకర్ ఉన్నారు.

పీటీఐ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి


రాకం ప్రభాకర్

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం పీటీఐ ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రుద్రారం జెడ్పీ పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు రాకం ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు 13 విభాగాల్లో పనిచేస్తున్నారని, అన్ని విభాగాల్లో ఈ విద్యా సంవత్సరంలో తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి, మళ్లీ మూడు రోజుల్లో విధుల్లోకి తీసుకున్నారన్నారు. కాగా పాఠశాలల్లో మాత్రం ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ , పీఈటీలను ఏప్రిల్ 23న తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, మిగతా వారిని విధుల్లోకి తీసుకొని కేవలం తమను విధుల్లోకి తీసుకోకపోవడంతో ఇబ్బందిపడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని పాఠశాలలో పనిచేస్తున్న పీటీఐలను విధుల్లోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కనగర్తి చెరువులో మట్టి తరలింపు

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అధికారుల తీరుపై అనుమానం?


ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలింపు

ఇల్లందకుంట: అక్రమార్కులు పట్టపగలే జోరుగా మట్టి తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. సంబంధిత అధికారులు సహకరిస్తున్నారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా అధికారులకు సమాచారమిస్తే ఇప్పుడే సిబ్బందిని పంపుతున్నామని అంటున్నారని, వారు వచ్చే లోపు అక్రమార్కులు పారిపోతున్నారని, ఎవరో వారికి సమాచారమిస్తున్నారని పలువురు గ్రామస్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కనగర్తి గ్రామ చెరువులో కొందరు అక్రమంగా మట్టిని జేసీబీతో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారమందించారు. చెరువులో జేసీబీలతో మట్టిని తరలిస్తున్న దుండగులు అధికారులు వచ్చే విషయం తెలుసుకొని అక్కడి నుంచి పారిపోయారని గ్రామస్తులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఎండాకాలం రాగానే కొంతమంది గ్రామానికి చెందిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి మట్టిని అమ్ముకొని వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. భూగర్భజలాలు అడుగంటిపోతున్న సమయంలో తమ ఇష్టారాజ్యంగా తవ్వుతూ చెరువును పెద్ద గుంతలుగా మారుస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నామని, ఆర్ఐ వెళ్లేసరికి ఎవరూ లేరని తెలిపారు. మాకు సంబంధం లేదని, ఇరిగేషన్ విభాగానికి అప్పగించామని వివరించారు.

32 పార్టీలను ఒప్పించి రాష్ట్రం సాధించాం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్‌కుమార్


చిగురుమామిడిలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

చిగురుమామిడి: మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఐదుగురం ఎంపీలం గెలిచి పార్లమెంట్‌లో తెలంగాణ సాధన కోసం 32 రాజకీయ పార్టీలను ఒప్పించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించినట్లు కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి చిగురుమామిడి అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. రాష్ట్రాన్ని సాధించే క్రమంలో అప్పటి ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీలను ఒప్పించి మెప్పించి రాష్ట్రాన్ని సాధించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందనే విషయాన్ని ప్రజలు మరవరాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీని చేయాలని కోరితే ఆగస్టు 15 వరకు డెడ్‌లైన్ ఎందుకు పెడుతున్నారో అర్థం కావడం లేదని, కాంగ్రెస్ అంటేనే మోసాలకు మారుపేరని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, రసమయి బాలకిషన్, ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పదవి ఏడాది దాటదు

సైదాపూర్: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి ఏడాది దాటదని, కాంగ్రెస్ అధిష్టానమే తొలగిస్తుందని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు చేయని ముఖ్యమంత్రి ప్రతిపక్షంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, రసమయి బాలకిషన్, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజయ్య, రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామడుగులో ఇన్‌హౌస్ ప్రజావేదిక కార్యక్రమం


ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో పీడీ శ్రీధర్

రామడుగు: ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ఇన్‌హౌస్ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో 2023 ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 2024 వరకు మండలంలోని పలు గ్రామాల్లో రూ.3,98,22,310 విలువ చేసే పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేశారు. దీనిపై మండలస్థాయి సమీక్ష నిర్వహించారు. పనుల నిర్వహణలో మస్టర్ రోల్ కొట్టివేతలు, దిద్దుబాటు ఉన్నందున.. ఇలాంటివి మళ్లీ చేయొద్దని అధికారులు హెచ్చరించారు. ప్రతి గ్రామంలో 150 మంది కూలీలు పనులు చేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ ఉప్పుల శ్రీధర్, ఏపీడీ సంధ్యారాణి, క్లస్టర్ పీడీ కృష్ణ, అంబుడ్స్‌మెన్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ కళావతి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఏఈ సచిన్, ఏపీవో రాధ, సుశీల, సత్యప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వైభవంగా రథోత్సవం

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో బుధవారం సీతారామచంద్రస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారిని రథోత్సవానికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కంకణాల రాజగోపాల్‌రెడ్డి, గంగాధర కనుకయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక బుధవారం వాయిదా పడింది. ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన మండల పరిషత్‌లో సమావేశం ప్రారంభం కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎంపీటీసీలు సమావేశానికి రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల కోడ్ ముగిశాక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

హుజూరాబాద్‌రూరల్: ఆటో డ్రైవర్ల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం గమనించి వెంటనే ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఆటో యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకం కాదని, ఈ పథకం ద్వారా ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమయ్యాయని పేర్కొన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సిరికొండ శరత్, ఎస్కే ఫయాజ్, కృష్ణ, ఎస్కే ఫిరోజ్ పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

వీణవంక: రోడ్లపై ఇష్టానుసారంగా ధాన్యం ఆరబోస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తోట తిరుపతి హెచ్చరించారు. మండల కేంద్రం నుంచి వల్బాపూర్ గ్రామం వరకు ప్రధాన రహదారిపై ధాన్యం, మొక్కజొన్న ఆరబోసిన రైతులతో ఎస్సై మాట్లాడారు. రోడ్లపై ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, రైతులు ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేసుకొని ధాన్యం ఆరబోసుకోవాలని సూచించారు.

రిజర్వేషన్ మార్చాలని ఫిర్యాదు

వీణవంక: ప్రస్తుతం ఉన్న సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లను మార్చాలని కోరుతూ ఎల్బాక మాజీ ఉప సర్పంచ్ ఊట్ల దేవయ్య ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఎల్బాక గ్రామంలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మార్చి ఎస్సీలకు కేటాయించాలని గత నెల 12న ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి జిల్లా పంచాయతీ అధికారి వివరణ ఇస్తూ ప్రస్తుతం కొనసాగుతున్న రిజర్వేషన్లనే మరో టర్మ్ వరకు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఆశావాహుల కలలు ఆవిరయ్యే అవకాశం నెలకొంది.

మద్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కృష్ణాకాలనీలో పర్లపల్లి తిరుపతి అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తూ, అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఇంట్లో సోదాలు నిర్వహించారు. రూ.3,150 విలువైన మద్యం పట్టుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



శ్రీలక్ష్మీనరసింహాస్వామి రథోత్సవం

గన్నేరువరం: గన్నేరువరంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి రథాన్ని భక్తుల సందర్శనార్థం గ్రామ వీధుల గుండా తిప్పారు. భక్తులు టెంకాయలతో మొక్కలు చెల్లించి కానుకలను సమర్పించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. గన్నేరువరంతోపాటు చొక్కారావుపల్లె, యాస్వాడ, చాకలివానిపల్లె, మైలారం, ఖాసీంపేట గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు


బండి సంజయ్‌తో నాయకులు

కరీంనగర్‌టౌన్/శంకరపట్నం: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. తాజాగా మానకొండూరు నియోజకవర్గంలోని కేశవపట్నం మండలం లింగాపూర్ ఎంపీటీసీ అంతం లతారాజిరెడ్డి, మెట్‌పల్లి ఎంపీటీసీ కొయ్యాడ శోభారాణి ఆధ్వర్యంలోని పలువురు నేతలు బుధవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. బండి సంజయ్ వారందరికీ కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు నరేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బిజిలి సారయ్య, రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్‌వర్మ, కొయ్యడ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలో ఉన్న బెదర్‌పల్లి గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి నవగ్రహ, ధ్వజప్రతిష్ఠ, యాగశాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం వేదపండితులు ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పంచగవ్యప్రోక్షణ, క్షీరాధివాసం, మూర్తి కుంభవాహనం, నిత్యారాధనం, కళాకుంభ ఆవాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు, గ్రామస్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న వెలిచాల రేఖరావు

వెలిచాల రేఖరావు ప్రత్యేక పూజలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవంలో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సతీమణి వెలిచాల రేఖరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి, వేద పండితులు కిరణాచార్యులు, చొప్పదండి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ రామోజు మాధవచారి, దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కోడిమ్యాల రమణ, శ్రీనివాస్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు


చికిత్స పొందుతున్న రాజు

చిగురుమామిడి: మండలంలోని చిన్న ములకనూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... ధర్మసాగర్ మండలం దేవునూర్‌కు చెందిన రాజు(37) తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి బస్‌స్టేజీ వద్ద కోహెడ మండలం ఎర్రగుంటపల్లెకు చెందిన గొల్లెని శ్రీనివాస్ అనే యువకుడి బైక్ ఎక్కాడు. హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం చిన్న ములకనూర్ శివారులో వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు స్వప్పగాయాలు కాగా రాజుకు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెంచిన వేతనాలను చెల్లించాలి


కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

చిగురుమామిడి: ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.300 వేతనాన్ని చెల్లించాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన మండలంలోని నవాబుపేట గ్రామంలో ఈజీఎస్ కూలీలు పనిచేస్తున్న చోటుకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని ఆయన కోరారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని కోరారు. ఆయన వెంట బూత్ అధ్యక్షుడు గూల్ల రాజు, ఎన్నం సంతోష్, గూల్ల వెంకటేశం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గూల్ల సాయికృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గంగాధర: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు ఓటు వేయాలని బీజేపీ నాయకులు కోరారు. మండలంలోని గోపాల్‌రావుపల్లి, మధురానగర్ గ్రామాల్లో ఉపాధి పనుల వద్ద నాయకులు ప్రచారం నిర్వహించారు. రైతులకు లక్ష రుణమాఫీ చేస్తానని మోసం చేసిన బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉచిత రేషన్ ఇస్తున్న ఘనత నరేంద్రమోడీదేనన్నారు. అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్, అందాపురి రాజేశ్, మిట్ట మధు, గుండేటి మల్లేశం, పెంచాల రాములు, వొడ్నాలరాజు, రేండ్ల శ్రీనివాస్, సుంకరి అనిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

వీణవంక: పోతిరెడ్డిపల్లికి చెందిన రాజమ్మ ఇటీవల మృతిచెందింది. బుధవారం అతిథి డెవలపర్స్ అధినేత రాకేశ్‌రెడ్డి తన అనుచరుల ద్వారా 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందించారు. సతీశ్, ప్రశాంత్, కర్ణాకర్, విద్యాసాగర్, ఐలయ్య, భిక్షపతి, మొగిళి, సమ్మయ్య, చింటు తదితరులున్నారు.